# కల్వరి తెచ్చిన సిరులు

చరిత్రలో 'కల్వరి' ఆకస్మిక సంభవం కాదు - క్రీస్తు ప్రభువు మరణం అకాలము కాదు. అది దేవుని అనాది సంకల్పం. కల్వరి ప్రపంచానికి కేంద్రస్థలం. అది క్రైస్తవ విశ్వాసికి పుణ్యక్షేత్రం.'కల్వరి' అనే లాటిన్ మాటకు కపాలం అని అర్థం. క్రీస్తు సిలువ వేయబడిన కొండ 'మనిషి కపాలమును' పోలియున్న కారణాన దీనికి ఆ పేరు వచ్చింది. దీనినే హెబ్రీభాషలో 'గొల్గొత' అని పిలిచారు(యోహాను 19:17);గనుక కల్వరి, గొల్గొత, కపాల స్థలం ఇవన్నీ ఒకే అర్థాన్ని సూచిస్తున్నాయి.

కల్వరి అంటూనే అమానుషం, అవమానం, అవహేళన, కఠినకర్కశులైన రోమా సైనికుల పైశాచికచర్యలు, ముళ్ళకిరీటం, రక్తం జ్ఞప్తికి వస్తాయి. కాని కల్వరిలో మానవునికి ఎన్నో మంచి మేళ్ళు సంక్రమించాయి. పవిత్రుడైన దేవుడు పాపియైన మానవున్ని కలిసికొన్న స్థలమే కల్వరి. దేవుని ప్రేమ ఎంత ప్రగాఢ మైనదో కల్వరిలో మనం చూడగలం. అందుకే క్రీస్తు ప్రేమను గూర్చి మనం మాటలాడినప్పుడెల్లా కల్వరిని, సిలువను తలంచకుండా ఉండలేము. ఆనాటి యూదా మత నాయకులు రాబందుల్లాంటి రోమా సైనికులు ఏసును కల్వరికి అప్పగించారు. ఆయన చరిత్ర ఇంతటితో సమాప్తం అయ్యింది అని అపోహపడ్డారు. కాని ఆ స్థల మందే ఒక దొంగ విశ్వాసం ఆరంభమైంది.

## 1. కల్వరి ప్రార్ధన స్థలం

లూకా 24:42;కల్వరిగిరి పై ఇరువురు వ్యక్తులు ప్రార్ధించినట్లుగా నూతన నిబంధన మనకు ప్రభోధిస్తోంది. ఒకరు దైవ మానవుడైన ఏసు క్రీస్తు. మరొకరు ఏసు ప్రక్కన సిలువ వేయబడిన ఒక బందిపోటు దొంగ. "తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించు" అని ఏసు ప్రార్ధించి మానవాళికి క్షమాబిక్షప్రసాదించాడు. ఏసు సిలువ కార్యక్రమమును ప్రార్ధనతో ఆరంభించి ప్రార్ధనతో ముగించినట్లు ఏసు సిలువపై పల్కిన సప్తసూక్తుల ద్వారా మనకు విదితమౌతోంది. ఏసు ఇతరుల కొరకు ప్రార్ధిస్తే, దొంగ తన కొరకు "ఏసూ, నీవు నీ రాజ్యములోనికి వచ్చునపుడు నన్ను జ్ఞాపకం చేసికో" అని ప్రార్ధించాడు. దొంగ చేసిన ఈ ప్రార్ధన యదార్ధమైంది, విశ్వాస సహితమైంది. ఈ ప్రార్ధనను యేసు అంగీకరించాడు. గనుకనే ఆయన ఒంటరిగా వెళ్ళకుండా రక్షింపబడిన దొంగతో కలిసి పరదైసుకు వెళ్లాడు. "ఎక్కడ పేతురు విశ్వాసం సడలిందో అక్కడ దొంగ విశ్వాసం ఆరంభమైంది" అని మహనీయుడైన మార్టిన్ లూథర్ అన్నాడు.

## 2. కల్వరి క్షమాస్థలం:

లూకా 23 : 24 కల్వరి కేవలం ప్రార్ధన స్థలం మాత్రమే కాదు,కల్వరి క్షమాస్థలం కూడా..ఇంకో మాటలో చెప్పాలి అంటే క్షమాపణకు పుట్టిల్లు కల్వరి. ఏసు క్షమాగుణం గలవాడు మాత్రమే కాదు, క్షమాసమృద్ధి గలవాడు కూడా. సిలువ పై దొంగను క్షమించాడు. దూషించి, దుర్భాషలాడిన రోమా సైనికులను, యూదా మతాధికారులను యేసు మనస్ఫూర్తిగా క్షమించాడు,ఆయనను హింసించిన వారిలో

(1) క్రీస్తును శరీర సంబంధంగా హింసించినవారు మొదటివర్గం

(2) ఏసును అవమానించినవారు రెండవ వర్గం వారు.

(వీరు ఏసును మాసికంగా హింసించారు. అనగా బహిరంగ స్థలములలో వస్త్రములను తొలగించుటద్వారా, ఉమ్మివేయుట ద్వారా, ముసుగు వేయుట ద్వారా ప్రభువును మానసికంగా, హింసించారు)

(3) ఆయన దైవత్వమును దూషించినవారు మూడవ వర్గం.

(దేవుని కుమారుడవైతే దిగిరమ్ము, ఇతరులను రక్షించావుగదా ! నిన్ను నీవు రక్షించుకోలేవా? ఇశ్రాయేలు రాజా! దిగారా! అని ఆయన దైవత్వమును శంకించి ఆత్మ సంబంధమైన హింసకుక్రీస్తును గురిచేశారు)

ఈ మూడువర్గాలవారిని ఏసు క్షమించాడు. అందుకే కల్వరి క్షమాస్థలంగాను, పుణ్యభూమిగాను మారింది.

## 3. కల్వరి ఆదరణ స్థలం

యోహాను 19: 26, 27; కల్వరి ప్రార్ధన స్థలం, క్షమాస్థలం మాత్రమే కాదు, కల్వరి ఆదరణ స్థలం కూడా, కల్వరి పై క్రీస్తు తల్లియైన మరియకు ఆదరణ లభించింది. క్రీస్తు చనిపోతూ తన ప్రియతల్లిని ప్రియ శిష్యుడైనయోహాను సంరక్షణకు అప్పగించాడు. ధర్మశాస్త్రంలోని ఆజ్ఞను నెరవేర్చాడు (నిర్గమ 20: 2). తల్లిని తండ్రిని సన్మానించుమని ఆదేశించి సిలువ పై ఆదర్శం చూపాడు. అందుకే మాతృమూర్తులందరికీ కల్వరి ఆదరణ స్థలంగా మారింది. ఆదరణ గురించి బైబిల్ గ్రంథం ఇలా చెబుతుంది.

(1) తల్లిలా, తండ్రిలా దేవుడు మనలను ఆదరిస్తాడు. యెషయ 66 : 13; 11 కొరి 1: 3

(2) స్నేహితునిలా యేసు ఆదరిస్తాడు- యోహాను 14 :1-

(3) ఆదరణ కర్త అను పేరు పొందిన పరిశుద్ధాత్ముని ద్వారా మనకు అనుదినం ఆదరణ లభిస్తోంది. (యోహాను 14: 16).

(4) అంతేకాదు నీ వాక్యం నా బాధల్లో నాకు ఆదరణ, నెమ్మది కలిగిచిందని దావీదు భక్తుడు సాక్ష్యమిచ్చాడు

(కీర్తనలు 119 : 50).

దేవుడు మనలను ఇంతగా ఆదరించుటకు గల కారణం మనం ఇతరులను ఆదరించాలనే. మన సోదరులెవరైనా కృంగిన స్థితిలో ఉంటే మనం వారిని ప్రేమతో క్రీస్తువలే ఆదరించాలిగాని అదరగొట్టకూడదు. దుఃఖంలో నున్న సోదరుడా ? నిరుత్సాహంలో ఉన్న సోదరీ ! కల్వరి వైపు వీక్షించి ఆనందం, ఆదరణ పొందు.

## 4. కల్వరి ఆరాధన స్థలం

ప్రక 5:9 పరలోకానికి మనం వెళ్ళాక అన్నీ మరచిపోతాం. కాని సిలువ, కల్వరి ఇవి రెండూ జ్ఞాపకముంటాయి. అక్కడికి వెళ్ళాక ఆయన గాయములను చూస్తాం. యేసు తన స్వరక్తమిచ్చి సంపాదించిన ఆయన ప్రజలను చూస్తాం. ఆయన సంపాద్యంగా మనం ఉన్నందుకు హర్షిస్తాం. ఆయనను స్తుతిస్తూ పరలోక పెద్దలతో కలసి కృతజ్ఞతతో ఆయనను ఆరాధిస్తాం. అయిన గాయములు చూసి ప్రభువా! ఏమిచ్చి నీ ఋణం తీర్చుకోగలం అని ప్రార్థిస్తాం. అందుకే కల్వరి పరలోక పెద్దలకు భూలోక విశ్వాసులకు ఆరాధన స్థలం.

ఈనాడు ఎందరు కవులు కల్వరిని గూర్చి కవితలు వ్రాస్తున్నారో ! మరెందరు గాయకులు కల్వరిని గూర్చి గానం చేస్తున్నారో ! మరెందరు నాయకులు కల్వరిగూర్చి ప్రసంగిస్తున్నారో ! ప్రార్ధన మందిరాలలో ఎన్ని ఆత్మలు చేరి గొల్గొతా క్రీస్తును ఆరాధిస్తున్నారో మనకు తెలుసు. గొల్గొతాలో పాతిపెట్టబడిన సిలువ ఒక ఎండు కొయ్య. అయితే అది అహరోను కర్రవలె చిగిరించి, వికసించి, పుష్పించింది. దాని వ్రేళ్ళు ప్రపంచంలోని ప్రతిస్థలంలో నింపే విధంగా అది ప్రపంచంలోనే పెద్ద మతంగా క్రైస్తవ మతం ప్రబలింది. ప్రియ నేస్తం ! యేసు సిలువ వైపు చూస్తూ రక్షింపబడు. "సర్వలోక నివాసులారా ! నా వేపు చూచి రక్షణ పొందండి" అంటూ దేవుడు మనలను ఆహ్వానిస్తున్నాడు.